బెట్టింగ్ పేరుతో రూ.70 లక్షలు హాంఫట్

హిమాయత్‌నగర్: తాము చెప్పిన వెబ్‌సైట్‌లో బెట్టింగ్ కాస్తే అతి తక్కువ కాలంలో కోటీశ్వరుల్ని చేస్తామంటూ నగరానికి చెందిన ఓ టెకీకి సైబర్ నేరగాళ్లు వల వేశారు. రెండేళ్లుగా అతని వద్ద డబ్బు లూటీ చేస్తూనే ఉన్నారు. ఇప్పటివరకు రూ.70 లక్షలు కోల్పోయిన బాధితుడు బుధవారం సిటీ సైబర్‌క్రైం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

ఓయూ సెంటినరీ పైలాన్‌కు శంకుస్థాపన



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ శతాబ్ది ఉత్సవాలు జరిగిన ఆరు సంవత్సరాలకు సెంటినరీ పైలాన్ పనులకు బుధవారం వీసీ ప్రొఫెసర్ రవిందర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ శంకుస్థాపన చేశారు.

శనివారాల్లోనూ పాస్‌పోర్ట్ స్పెషల్ డ్రైవ్

సనత్‌నగర్: పాస్‌పోర్ట్ దరఖాస్తుల డిమాండ్ ఎక్కువ ఉండడంతో శనివారాల్లో సైతం స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు రీజినల్ పాస్‌పోర్ట్ అధికారి దాసరి బాలయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29 నుంచి జరిగే స్పెషల్ డ్రైవ్ ద్వారా త్వరితగతిన దరఖాస్తులను క్లియర్ చేస్తామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

న్యూస్‌రీల్

భూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ

యాచారం: భూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నామని తహసీల్దార్ సుచరిత అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో బుధవారం ఆమె సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మండలంలోని 24 గ్రామ పంచాయతీలకు సంబంధించి ఏడాదిగా మీ సేవ సెంటర్ల ద్వారా 1,500కు పైగా అర్జీలు వచ్చాయన్నారు. వీటిలో ఎనభై శాతానికి పైగా పరిష్కరించామని తెలిపారు. గ్రామాల్లో అసైన్డ్ పట్టా భూములపై క్షేత్రస్థాయి సర్వే చేసి అసలైన అర్హులకే పాసుపుస్తకాలు అందేలా చూస్తామన్నారు. భూ సమస్యలపై రైతులు నేరుగా వచ్చి తెలియజేయాలని సూచించారు. సకాలంలో పరిష్కారమయ్యేలా చూస్తామని వెల్లడించారు.

వీఓఏల వినూత్న నిరసన



చేవెళ్లలో రోడ్డు ఊడుస్తున్న వీఓఏలు

చేవెళ్ల: వీఓఏల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ డిమాండ్‌చేశారు. మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవనం వద్ద సమ్మె చేస్తున్న వీఓఏలు బుధవారం రోడ్లు ఊడుస్తూ నిరసన వ్యక్తంచేశారు. వీరికి సీఐటీయూ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. గ్రామాల్లో మహిళల అభ్యున్నతికి 18ఏళ్లుగా కృషిచేస్తున్న వీఓఏలను చిన్నచూపు చూడటం తగదన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న అరకొర వేతనాలు సరిపోక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా కనీస వేతనం అమలు చేయడంతో పాటు ఉద్యోగ భద్రత, పీఎఫ్, బీమా సౌకర్యాలు కల్పించాలని కోరారు.

నూతన నియామకం



నియామక పత్రం అందజేస్తున్న మంత్రి

పహాడీషరీఫ్: బీఆర్‌ఎస్ మహేశ్వరం నియోజకవర్గ యువజన విభాగం ఉపాధ్యక్షుడిగా జల్‌పల్లి మున్సిపాలిటీకి చెదిన మహ్మద్ ఫర్వేజ్ నియమితులయ్యారు. ఈ మేరకు మంత్రి సబితా ఇంద్రారెడ్డి బుధవారం ఆయనకు నియామక ప్రతం అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. కష్టపడి పనిచేసే వారికి పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు.

రూ.94.75 లక్షల పరిహారం విడుదల

సాక్షి, రంగారెడ్డి జిల్లా: జిల్లాలో మార్చి 17 నుంచి 21 వరకు కురిసిన వడగండ్లతో నష్టపోయిన రైతులకు సంబంధించిన పరిహారాన్ని ప్రభుత్వం విడుదల చేసింది. ఈ మొత్తాన్ని జిల్లా ట్రెజరీలో జమ చేసింది. యాచారం, తలకొండపల్లి మండలాల్లో 619 మంది రైతులు వరి, మొక్కజొన్న, మామిడి, కూరగాయ పంటలు నష్టపోయారు. వీరికి రూ.94.75 లక్షల పరిహారం మంజూరు చేసింది. ఈ మొత్తాన్ని రైతులకు అందజేస్తామని కలెక్టర్ హరీశ్ తెలిపారు. చేవెళ్ల, షాబాద్ మండలాల్లో ఏప్రిల్ 14, 21వ తేదీల్లో కురిసిన వడగండ్లతో జరిగిన నష్టాన్ని అంచానా వేసి, నివేదిక అందజేయాలని అధికారులను ఆదేశించారు.

'పీఎం శ్రీ'కి ఎంపిక



కడ్తాల్: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధాన మంత్రి శ్రీ పథకానికి ఎంపికైంది. దీంతో ఈ పాఠశాలకు ఐదేళ్ల కాలంలో రూ.2 కోట్ల నిధులు సమకూరనున్నాయి. స్కూల్‌లో వసతుల కల్పన, అభివృద్ధి పనుల కోసం కేంద్రం నుంచి ఏటా రూ.40 లక్షల చొప్పున ఐదేళ్ల పాటు నిధులు విడుదలవుతాయి. అవార్డు రావడంపై డీఈఓ సుశీందర్ రావు, ఎంఈఓ సర్దార్, ఎంపీపీ కమ్లీమోత్యా నాయక్, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, సర్పంచ్ ఎల్ఎన్‌రెడ్డి హర్షం వ్యక్తంచేశారు. ఇందుకోసం కృషి చేసిన హెచ్ఎం జంగయ్య, ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు.



ఆమనగల్లు మార్కెట్ యార్డులో తడిసిన వరిధాన్యం

నేలరాలిన ఆశలు



ఆమనగల్లు మండలం మంగళపల్లిలో వర్షానికి నేలరాలిన మామిడికాయలు

పగబట్టిన ప్రకృతి
- అకాల వర్షాలు, వడగండ్లు, పిడుగుపాట్లతో తీరని నష్టం
- పొలాల్లో రాలిన ధాన్యం, మామిడి
- ఉద్యాన పంటలు ధ్వంసం
- కొనుగోలు కేంద్రాల్లో కొట్టుకుపోయిన వడ్లు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: అకాల వర్షాలు అన్నదాతను నట్టేట ముంచేస్తున్నాయి.. ఈదురు గాలులు, వడగండ్లు బీభత్సం సృష్టిస్తున్నాయి. కనీసం చేతికందిన పంటనైనా అమ్ముకుందామంటే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడం లేదు. పది రోజుల క్రితమే యాసంగి కోతలు మొదలయ్యాయి. పంట కోసిన రైతులు ధాన్యాన్ని కొనుగోలు సెంటర్లకు తరలించారు. రాశులుగా పోసిన ధాన్యం అకాల వర్షాలకు తడిసి ముద్దవుతోంది. యాసంగి ధాన్యం సేకరణకు ప్రభుత్వం జిల్లావ్యాప్తంగా 37 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. కానీ కడ్తాల్, తలకొండపల్లి మినహా ఇతర ప్రాంతాల్లో ఎక్కడా సెంటర్లను ప్రారంభించలేదు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కొనుగోళ్లు చేపట్టపోవడంతో కొంతమంది రైతులు పంట కోతలను ఆపేశారు. విరుచుకుపడుతున్న వడగండ్లు ఎప్పుడు ఏం చేస్తాయోనని భయంభయంగా గడుపుతున్నారు. మంగళవారం వీచిన భారీ ఈదురు గాలులు, పలుచోట్ల కురిసిన వడగండ్లతో వడ్లు నేల రాలాయి. ఇదిలా ఉండగా కోత కోసిన రైతులు ధాన్యం ఆరబెట్టేందుకు అవస్థలు పడుతున్నారు. సరైన కల్లాలు లేక రోడ్ల వెంట ఆరబోశారు. వీటిపై కప్పేందుకు టార్పాలిన్లు లేక చినుకు రాలితే వణికిపోతున్నారు.



కొందుర్గు: ముష్టిపల్లిలో పిడుగుపాటుతో మృతిచెందిన పాడి ఆవులు

13 లక్షల బ్యాగులు..

జిల్లాలో ఈ యాసంగి 26,392.788 హెక్టార్లలో వరి సాగు చేయగా, 1,63,045 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇందులో 60 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం.. కొనుగోలు కేంద్రాలకు వస్తుందని భావిస్తున్నారు. సేకరణ కోసం 15 లక్షల గన్నీ బాగ్యులు అవసరమని భావించి, ఈ మేరకు ఇప్పటికే 13 లక్షల సంచులు సిద్ధం చేశారు. వీటి నాణ్యతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గత యాసంగి, వర్షాకాలంలో మెజార్టీ కేంద్రాల్లో రంధ్రాలు పడిన, చిరిగిపోయిన గన్నీ బ్యాగులు దర్శనమివ్వడమే ఇందుకు కారణం. నాణ్యత, తాలు, తేమ, తరుగు పేరుతో ఒక్కో బస్తాకు రెండు కేజీలు తగ్గిస్తుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది. సివిల్ సప్లయ్, వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ అధికారులు ఎప్పటికప్పుడు ఆయా మార్కెటింగ్ కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించి, తూకంలో మోసాలు లేకుండా చూడాల్సి ఉంది. కానీ సివిల్ సప్లయ్ అధికారులు ఆఫీసు దాటి బయటికి రావడం లేదనే విమర్శలున్నాయి.

పంట నష్టం అంచనా

జిల్లాలోని పలుచోట్ల మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులతో కూడిన వర్షం పడటంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. అబ్దుల్లాపూర్‌మెట్, ఆమనగల్లు, ఇబ్రహీంపట్నం, మెయినాబాద్, తలకొండపల్లి, నందిగామ తదితర ప్రాంతాల్లో ధాన్యం సహా మామిడి నేలరాలింది. వ్యవసాయశాఖ అధికారులు బుధవారం ఆయా ప్రాంతాల్లో పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేసి, ప్రభుత్వానికి నివేదిక పంపారు.

ఆమనగల్లులో భారీ వర్షం

ఆమనగల్లు: మండలంలో మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షంతో చేతికి వచ్చిన పంటలు నీటి పాలయ్యాయి. మామిడి కాయలు నేలరాలాయి. ఉద్యాన పంటలు ధ్వంసమయ్యాయి. మొత్తం 510 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని అధికారులు అంచనా వేశారు. అర్ధరాత్రి కురిసిన వడగండ్లతో ఆకుతోటపల్లి, శెట్టిపల్లి, జంగారెడ్డిపల్లి, నుచ్చుగుట్టతండా, సాకిబండతండా, మేడిగడ్డతండా, మంగళపల్లి, చింతలపల్లి, పోలెపల్లి, కోనాపూర్, రాంనుంతలలో తీవ్ర నష్టం జరిగింది. వ్యవసాయాధికారి అరుణ కుమారి, ఏఈఓలు సాయిరాం, శివతేజ, రాణి క్షేత్రస్థాయిలో పర్యటించి వివరాలు సేకరించారు. ఆకుతోటపల్లిలో దెబ్బతిన్న పంటలను మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, మంగళపల్లిలో సర్పంచ్ నర్సింహారెడ్డి, పోలెపల్లిలో కల్వకుర్తి వైఎస్సార్‌టీపీ ఇన్‌చార్జ్ చీమర్ల అర్జున్‌రెడ్డి పరిశీలించారు. ఆమనగల్లు పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులు ఆరబెట్టిన ధాన్యం పూర్తిగా తడిసి ముద్దయింది. కొట్టుకుపోయిన ధాన్యాన్ని ఒక్కచోటకు నేర్చేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



ఆమనగల్లు మార్కెట్ యార్డులో కొట్టుకుపోయిన ధాన్యాన్ని ఎత్తుతున్న రైతులు

అధైర్య పడొద్దు



సుభాన్‌పూర్‌లో పంటలను పరిశీలిస్తున్న గీతారెడ్డి తదితరులు

మహేశ్వరం: అకాల వర్షాలకు నష్టపోయిన రైతులు అధైర్య పడొద్దని, ప్రభుత్వం తరఫున అన్ని విధాలా ఆదుకుంటామని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గీతారెడ్డి అన్నారు. సుభాన్‌పూర్, దిలావర్‌గూడలోని పంట పొలాలను బుధవారం ఆమె పరిశీలించారు. ఎంపీపీ కోరుపోలు రఘుమారెడ్డి, ఏడీఏ సుజాత ఎంపీడీఓ నర్సింహ, బీఆర్ఎస్ నాయకులు పోచారం సుధాకర్ రెడ్డి, ఏఓ నాగమణి, రైతులు ఉన్నారు.

మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు నమోదైన వర్షపాతం

ప్రాంతం	వర్షపాతం (సెం.మి.)
శంకర్‌పల్లి	2.57
శేరిలింగంపల్లి	5.42
గండిపేట్	2.90
బాలాపూర్	2.65
హయత్‌నగర్	4.33
అబ్దుల్లాపూర్‌మెట్	3.79
ఆమనగల్లు	7.49
తలకొండపల్లి	3.37
కేశంపేట	3.36
కడ్తాల్	4.76
కందుకూరు	4.64
మహేశ్వరం	5.22
షాబాద్	3.86
కొత్తూరు	4.24
నందిగామ	4.35
ఫరూఖ్‌నగర్	3.08
కొందుర్గు	3.06
చౌదరిగూడ	3.84

అన్ని కేంద్రాలు ప్రారంభిస్తాం

ధాన్యం కొనుగోలుకు జిల్లా వ్యాప్తంగా 37 సెంటర్లను ఎంపిక చేశాం. తలకొండపల్లి, కడ్తాల్ కేంద్రాలను ఇప్పటికే ప్రారంభించాం. మిగిలిన వాటిని వారం రోజుల్లో అందుబాటులోకి తీసుకొస్తాం. తాలు, మట్టి, ఇతర వర్థ్యాల తొలగింపు కోసం ప్యాడీ క్లీనర్లు, టార్పాలిన్లు, తూకం, తేమ నిర్ధారణ యంత్రాలను అందుబాటులో ఉంచాం. కొనుగోలు కేంద్రాల నుంచి సేకరించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఎంపిక చేసిన 15 రైస్ మిల్లులకు పంపుతాం. రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా చూస్తాం.

– శ్యామరాణి, సివిల్ సప్లయ్ అధికారి

ప్రపంచ దేశాలకు దీటుగా అంతరిక్ష పరిశోధనలు

భారత తొలి వ్యోమగామి రాకేష్‌శర్మ
- ఇతర గ్రహాలపై మానవ మనుగడ అంత సులువు కాదు
- ప్రస్తుతం గగన్‌యాన్‌పై ఇస్రో దృష్టి
- అంతరిక్షం నుంచి భారత్‌ను చూడటం గొప్ప అనుభూతినిచ్చింది
- మళ్లీ అవకాశం వస్తే వదులుకోను..



సాక్షి, సిటీబ్యూరో: ప్రస్తుత అధునాతన సాంకేతిక యుగంలో అన్ని దేశాలు అంతరిక్ష పరిశోధనలపైన దృష్టి సారించాయి. భారత్ కూడా ఇస్రో ఆధ్వర్యంలో ఇప్పటికే చంద్రయాన్ వంటి ప్రాజెక్టులను చేపట్టింది. త్వరలో ప్రతిష్టాత్మక గగన్‌యాన్‌ను అంతరిక్షంలోకి పంపించే ప్రయత్నంలో ఉంది. 40 ఏళ్ల క్రితమే భారత్‌కు చెందిన వింగ్ కమాండర్ రాకేష్ శర్మ అంతరిక్షంలో మొదటిసారిగా కాలుమోపారు. సోవియట్ ఇంటర్ కాస్మోస్ ప్రాజెక్ట్‌లో భాగంగా 1984లో అంతరిక్షం చేరిన మొదటి భారతీయ వ్యోమగామిగా రాకేష్ శర్మ చరిత్ర సృష్టించారు. హైదరాబాద్‌లోని సెయింట్ జార్జ్ గ్రామర్ స్కూల్‌లో ప్రాథమిక విద్యాభ్యాసం చేసి, నిజాం కళాశాల నుంచి పట్టభద్రులైన రాకేష్ శర్మ అనంతరం స్పేస్ రీసెర్చ్‌లో తన ప్రాతినిధ్యాన్ని పంచుకున్నారు. ఉస్మానియా యూనివర్సిటీ 106వ స్థాపకదినోత్సవం సందర్భంగా బుధవారం ఇక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అప్పట్లో అంతరిక్షం నుంచి ప్రధాని ఇందిరాగాంధీతో మాట్లాడినప్పుడు.. అక్కడినుంచి భారత్ ఎలా కనిపిస్తోందని ఆమె అడిగితే.. 'సారే జహాసే అచ్చా..'అని చెప్పానంటూ ఆనాటి మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. అంతరిక్ష యానానికి సంబంధించి రాకేష్‌శర్మ తెలిపిన ఆసక్తికర విషయాలు ఆయన మాటల్లోనే..



ఓయూలో మాట్లాడుతున్న రాకేష్‌శర్మ

వేదికల అన్వేషణ దిశగా..

భారత్‌లో 40 ఏళ్ల క్రితం ఉన్న సాంకేతికతకు, ప్రస్తుత అధునాతన టెక్నాలజీకి మధ్య చాలా వ్యత్యాసం ఉంది. అంతరిక్ష పరిశోధనల్లో భారత్ ప్రపంచ దేశాలకు పోటీగా మారింది. స్పేస్ టెక్నాలజీలో ఎంతో అభివృద్ధి చెంది సొంతగా ఎన్నో విజయవంతమైన ప్రాజెక్టులను చేపట్టింది. ఇందులో ఇస్రో కీలకపాత్ర పోషిస్తోంది. రానున్న ఏడాదిలో ప్రతిష్టాత్మకమైన గగన్‌యాన్ ప్రాజెక్టులో భాగంగా నలుగురు వ్యోమగాములను పంపించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ ప్రాజెక్టుకు నేను నేషనల్ అడ్వైజరీగా ఉండి పలు అంశాలను పర్యవేక్షిస్తున్నా.

గట్టి పునాదులు వేశారు..

అంతరిక్ష పరిశోధనలకు సంబంధించి విక్రమ్ సారాభాయ్ వంటి పరిశోధకులు గట్టి పునాది వేశారు. దానిని విశ్వవ్యాప్తం చేయాల్సిన బాధ్యత ప్రస్తుత తరంపై ఉంది. భవిష్యత్ అంతరిక్ష పరిశోధనలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చే వనరులను అన్వేషించనున్నాయి. భూమిపై పర్యావరణం క్షీణిస్తున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ వేదికలను సైతం వెతకనున్నాయి. చంద్రుడిపై మనిషి మనుగడ సాధ్యమే కానీ అది సాకారం కావాలంటే ఎంతో పురోగమించాలి.

అంతరిక్షంలో యోగా చేశా..

అంతరిక్షంలో ప్రయాణించాలంటే ముందే కఠిన శిక్షణ తీసుకోవాలి. అంతరిక్ష నౌక ప్రయాణ వేగం భూమ్యాకర్షణ శక్తికి వ్యతిరేకంగా ప్రతి సెకనుకు సున్నా నుంచి ఏడున్నర కిలోమీటర్లు పెరుగుతుంది. ఈ సమయంలో శరీరంపై చాలా ప్రభావం పడుతుంది. గుండె నుంచి వివిధ అవయవాలకు రక్తం సరఫరాపైనా ప్రభావం పడుతుంది. ఊపిరి పీల్చుకోవడం కూడా కష్టంగా మారుతుంది. ఇవన్నీ తట్టుకోవడానికి వీలుగా సాధారణ స్థాయి కన్నా నాలుగు రెట్ల వేగంతో రక్త ప్రసరణ జరిగేలా శిక్షణ ఉంటుంది. ఇందుకోసంయోగా సాధన కూడా చేశా.

అవకాశాల్ని యువత అందిపుచ్చుకోవాలి..

అంతరిక్షంలో నేను యోగా చేస్తుంటే దీని ఫలితాలు గమనించి ఒకరిద్దరు తోటి వ్యోమగాములు కొన్ని ఆసనాలను అడిగి మరీ ప్రయత్నించారు. గగన్‌యాన్ ప్రాజెక్టులో భాగంగా వ్యోమగాములకు సెంట్రిఫ్యూజ్ ఆధారిత శిక్షణ ఇస్తున్నారు. అంతరిక్షం నుంచి భారత్ మిశ్రమ వర్ణాల్లో అద్భుతంగా కనిపిస్తుంది. రాజస్థాన్ బంగారు వర్ణంలో, హిమాలయాలు ఊదా రంగులో కనిపిస్తాయి. వ్యోమనౌక కిటికీ నుంచి భూమిని చూడటం మరిచిపోలేని అనుభూతి. మళ్లీ అంతరిక్షంలోకి వెళ్లే అవకాశం వస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోను. ఓయూలో వనరులు అద్భుతంగా ఉన్నాయి. విద్యార్థులు ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకోవాలి.

తెలంగాణ పథకాలు భేష్

- అరుణాచల్‌ప్రదేశ్ బృందం కితాబు
- తమ రాష్ట్రంలోనూ అమలు చేస్తామని వెల్లడి



షాబాద్ మండలం సర్దార్‌నగర్ క్రీడా ప్రాంగణం వద్ద అరుణాచల్‌ప్రదేశ్ బృందం

షాబాద్: తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన పనులు బాగున్నాయని అరుణాచల్‌ప్రదేశ్ అధికారులు, ప్రజాప్రతినిధుల బృందం కితాబిచ్చింది. ఆ రాష్ట్రానికి చెందిన 25 మంది జెడ్పీ చైర్మన్లు, సర్పంచ్‌లు, అధికారుల టీం బుధవారం సర్దార్‌నగర్‌లో పర్యటించింది. గ్రామంలో చేపట్టిన పల్లెప్రకృతివనం, హరితహారం నర్సరీ, వైకుంఠధామం, కంపోస్ట్ యార్డు, క్రీడా ప్రాంగణం పనులను చూసిన సభ్యులు సంతోషం వ్యక్తంచేశారు. పల్లె ప్రగతి ద్వారా గ్రామాలు పరిశుభ్రంగా మారాయని తెలిపారు. ఇలాంటి పథకాలను తమ రాష్ట్రంలోనూ అమలు చేసేలా ప్రభుత్వానికి నివేదిక ఇస్తామన్నారు. వీరి వెంట డీపీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఏపీడీలు నీరజ, జంగారెడ్డి, ఎంపీడీఓ అనురాధ, గ్రామ సర్పంచ్ మునగపాటి స్వరూప, ఎంపీటీసీ వనిత, ఎంపీఓ హన్మంత్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, ఏపీఓ వీరాసింగ్, ఏపీఎం నర్సింహులు ఉన్నారు.

పకడ్బందీగా ఓటరు జాబితా

అర్హుల పేర్లు మిస్ కానివ్వం: కలెక్టర్ హరీశ్



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ హరీశ్, అధికారులు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ఓటరు జాబితాను పకడ్బందీగా రూపొందిస్తున్నామని, అర్హులైన ఏ ఒక్కరి పేరు కూడా మిస్ కాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని కలెక్టర్ హరీశ్ చెప్పారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో హరీశ్ మాట్లాడారు. ఇళ్లు మారిన వారితో పాటు మరణించిన వారి పేర్లు జాబితా నుంచి తొలగించామని, అర్హుల పేర్లు మిస్ కాకుండా చూస్తున్నామని చెప్పారు. ఓటర్ జాబితా నుంచి తొలగించిన పేర్లను మరోసారి పరిశీలించి, పోలింగ్ స్టేషన్ల వారీగా క్షేత్రస్థాయిలో నిర్ధారించుకుంటున్నామని వివరించారు. కొత్తగా ఓటు హక్కు పొందిన వారికి పోస్టు ద్వారా ఎపిక్ కార్డులు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు ప్రతీక్‌జైన్, తిరుపతిరావు, డీఆర్‌ఓ హరిప్రియ తదితర అధికారులు పాల్గొన్నారు.

అదుపు తప్పిన లారీ బోల్తా



బోల్తాపడిన లారీ

నందిగామ: మండల కేంద్రం శివారులో ఓ లారీ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ సంఘటన నర్సప్పగూడ రోడ్డులో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన ప్రకారం.. నందిగామ శివారులోని ఓ పరిశ్రమ నుంచి ఉత్పత్తులను ఇతర ప్రాంతాలకు తీసుకెళ్తున్న లారీ గ్రామ శివారులో అదుపు తప్పి బోల్తా పడింది. ఆ సమయంలో లారీలో ఉన్న డ్రైవర్ సురక్షితంగా బయట పడ్డాడు. రోడ్డు పూర్తిగా ఇరుకుగా ఉండటంతో ఎదురుగా వచ్చే వాహనాలకు దారి ఇచ్చే క్రమంలో లారీ బోల్తాపడి వరి చేనులో పడిపోయింది.

వడగళ్ల బీభత్సం

అకాల వర్షాలతో అన్నదాతలు తీవ్రంగా నష్టపోయారు. ఈదురు గాలులు, వడగళ్ల వానతో చేతికి వచ్చిన పంట నీటిపాలైంది. ఉరుములు, పిడుగుపాటు జిల్లాను కుదిపేశాయి. రైతులపై ప్రకృతి ప్రకోపం చూపడంతో వారి రోదనలు మిన్నంటుతున్నాయి.

జిల్లా వ్యాప్తంగా కురిసిన వర్షాలు

- వందల ఎకరాల్లో పంటనష్టం
- ఇంటి పైకప్పులు ధ్వంసం
- విద్యుత్ సరఫరాకు అంతరాయం



కొందుర్గు: ఎదిరలో నేలరాలిన మామిడి కాయలు

షాబాద్: మండల పరిధిలో మంగళవారం రాత్రి వడగళ్ల వాన బీభత్సం సృష్టించింది. వందల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. పలు గ్రామాలల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీవర్షం పడింది. ఈదురుగాలులతో కూడిన వర్షానికి పలు గ్రామాల్లో ఇంటిపై కప్పులు ఎగిరిపడగా, చాలాచోట్ల విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. దీనికి తోడు ట్రాన్స్‌ఫార్మర్లపై చెట్లు విరిగి పడటంతో గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మండలంలోని పరిధిలోని తాళ్లపల్లి, నాగర్‌గూడ, మద్దూరు, హైతాబాద్, సోలిపేట్, చందనవెళ్లి, మాచన్‌పల్లి, అంతిరెడ్డిగూడ, మన్‌మర్రి, బోడంపహాడ్, సర్దార్‌నగర్, తిర్మలాపూర్, ఏట్ల ఎర్రవల్లి, తిమ్మారెడ్డిగూడ గ్రామాలలో వరి, జొన్న, పూలు, కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. వ్యవసాయ అధికారులు పంట నష్టం అంచనా వేసి న్యాయం చేయాలని రైతులు కోరారు.

పిడుగుపాటు ఆవులు మృతి

కొందుర్గు: గాలిదుమారం, వాన రైతన్నలను నిలువునా ముంచింది. మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో రైతులు తీవ్రంగా నష్టపోయారు. మండల పరిధిలోని ఎదిర, గాలిగూడ, పెద్ద ఎల్కిచర్ల, వీరన్నపేట తదితర గ్రామాల్లో మామిడి కాయలు నేలరాలాయి. పలు గ్రామాల్లో చెట్లు నేలకూలాయి. ముష్టిపల్లి గ్రామానికి చెందిన చాకలి శ్రీనివాస్ తన ఆవులను పొలం వద్ద చెట్టు కింద కట్టివేయగా పిడుగుపడి రెండు ఆవులు మృతిచెందాయి. ఆవుల విలువ రూ. 1.5లక్షలు ఉంటుందని ప్రభుత్వమే ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

దెబ్బతిన్న పంటల పరిశీలన

తలకొండపల్లి: మండల పరిధిలో మంగళవారం ఈదురు గాలులు, ఉరుము మెరుపులతో కూడిన అకాల వర్షానికి పంటలు దెబ్బతిన్నాయి. మొక్కజొన్న నేలకొరిగింది, వరి పంట దెబ్బతింది. బుధవారం మండల పరిధిలోని వెల్జాల్, తిమ్మాపూర్, పడకల్ గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి ఏఓ రాజు ఆధ్వర్యంలో వ్యవసాయాధికారులు పర్యటించారు. దెబ్బతిన్న పంటలను గుర్తించారు. ఎంత మేర నష్టం జరిగిందని ఆరా తీశారు. 7 ఎకరాల్లో వరి, 20 ఎకరాల్లో మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నట్లు గుర్తించారు. ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని, వారి ఆదేశాల ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని ఏఓ చెప్పారు. కార్యక్రమంలో ఏఈఓలు నిఖిత, శిరీష తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు ఆవులు మృతి

తలకొండపల్లి: మండల పరిధిలో మంగళవారం రాత్రి ఈదులు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిశాయి. దీంతో పలుగ్రామాల్లో పిడుగుపాటుకు గురై ఆవులు మృతి చెందాయి. మండల పరిధిలోని వెల్జాల్‌కు చెందిన సీరడి స్వామికి చెందిన రెండు ఆవులు, చౌదర్‌పల్లికి చెందిన యాదయ్య ఆవు పిడుగుపడి మృతి చెందాయి. జీవనోపాధి కోసం అప్పుచేసి ఆవులు కొనుగోలు చేస్తే అవి చనిపోయాయని అప్పులు ఎలా తీర్చాలో తెలియడం లేదని స్వామి బోరున విలపించాడు. ప్రభుత్వమే తనను ఆదుకోవాలని ఆయన కోరాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీపీ శ్రీనివాసుయాదవ్ బుధవారం బాధితుడిని పరామర్శించి రూ.3వేల ఆర్థికసాయం అందజేశారు.



షాబాద్: మద్దూరు తండాలో దెబ్బతిన్న కూరగాయల పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు



వీఓఏల దీక్షలో కూర్చుని సంఘీభావం తెలుపుతున్న ఎమ్మెల్యే ఈటల

వీఓఏల పట్ల వివక్ష తగదు

- ఉద్యోగ, ఆరోగ్య భద్రత కల్పించాలి
- హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్

కద్తాల్: ఐకేపీ వీఓఏల పట్ల ప్రభుత్వం వివక్షత వీడి.. మహిళా సంఘాలకు ఇచ్చే బకాయిలు విడుదల చేయాలని హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. తమ సమస్యల పరిష్కారానికి వీఓఏలు చేపట్టిన సమ్మె బుధవారంతో పదో రోజుకు చేరింది. వారి ఎమ్మెల్యే ఈటల, బీజేపీ నాయకులు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. అసెంబ్లీ సాక్షిగా సీఎం కేసీఆర్ వీఓఏలకు సెర్ప్ ఉద్యోగుల మాదిరిగానే అన్ని సౌకర్యాలు కల్పిస్తామని చెప్పి.. గద్దెనెక్కి హామీని విస్మరించారని విమర్శించారు. పదిరోజులుగా సమ్మె చేస్తుంటే మంత్రులు, ఎమ్మెల్యేలు ఆటపాటలతో కాలక్షేపం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి రూ.26వేల కనీస వేతనం, ఆరోగ్యభద్రత, జీవితబీమా కల్పించి వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం వీఓఏలు తమ సమస్యలపై ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మాన్య, రాష్ట్ర నాయకులు శంకర్‌నాయక్, డాక్టర్ రమేశ్ అయ్యగార్, రవీందర్‌రెడ్డి, సాయిలాల్, లక్ష్మణ్ నాయక్, వెంకటేశ్, ప్రేమ్‌రాథోడ్, దశరథ, శ్రీకాంత్, శివ, ప్రవీణ్, వీఓఏ సంఘం నాయకులు ఉన్నారు.

ఎకరాకు రూ.50 వేలు ఇవ్వాలి

కందుకూరు: అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఎకరాకు రూ.50 వేల చొప్పున పరిహారం అందించాలని మాజీ మంత్రి, బీజేపీ నేత ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. కందుకూరులోని రాంరెడ్డి ఫంక్షన్ హాల్‌లో బుధవారం ఆయన బీజేపీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో కురుస్తున్న అకాల వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. బాధితులకు పరిహారం ఇవ్వకపోతే రైతుల పక్షాన ఉద్యమం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీపీ జ్యోతి, బీజేపీ నేతలు దేవేందర్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, మల్లారెడ్డి, పాండు,నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

పేదల కలను నెరవేర్చండి

- డబుల్ బెడ్‌రూం ఇళ్లు పంపిణీ చేయండి
- అధికారులు, ఎమ్మెల్యేల సమీక్షలో మంత్రి సబితారెడ్డి

సాక్షి, రంగారెడ్డి జిల్లా: అర్హులైన పేద లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు అందజేయాలని మంత్రి పి.సబితారెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం ఎమ్మెల్యేలతో కలిసి కలెక్టరేట్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. పేద ప్రజల సొంతింటి కలను సాకారం చేసేందుకు సీఎం కేసీఆర్ చేపట్టిన బృహత్తర పథకమే డబుల్ బెడ్‌రూం ఇళ్లు అని చెప్పారు. పెండింగ్ పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసి, లబ్ధిదారులకు అందించాలని సూచించారు. ఇళ్ల నిర్మాణం కోసం కాంట్రాక్టర్లు ముందుకు రాకపోతే ప్రత్యామ్నాయ మార్గాలను అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. కొత్తగా ఇళ్లు నిర్మిస్తున్న ప్రాంతాల్లో రోడ్లు, తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ కాల్వలు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. సమావేశంలో కలెక్టర్ హరీశ్, అదనపు కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎమ్మెల్యేలు గాంధీ, మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, అంజయ్య యాదవ్, ప్రకాశ్‌గౌడ్, సుధీర్‌రెడ్డి, కాలె యాదయ్య, ఆర్డీఓలు పాల్గొన్నారు.

కొండల్లోంచి ఎయిర్‌పోర్టు మెట్రో..

- రాజేంద్రనగర్ కొండపైన అలైన్‌మెంట్‌ను పరిశీలించిన ఎండీ

సాక్షి, సిటీబ్యూరో: రాయదుర్గం నుంచి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం వరకు చేపట్టిన ఎయిర్‌పోర్టు మెట్రో పనుల్లో వేగం పెరిగింది. ఒక వైపు భూసార పరీక్షలు నిర్వహిస్తుండగానే మరో వైపు వివిధ ప్రాంతాల్లో మెట్రో అలైన్‌మెంట్‌లలోని సమస్యలపైన అధికారులు అధ్యయనం చేపట్టారు. ఎయిర్‌పోర్టు చాలా వరకు రోడ్డు మార్గం గుండానే వెళుతున్నప్పటికీ ఒకటి, రెండు చోట్ల కొండలపై నుంచి మెట్రో పరుగులు తీయవలసి వస్తుంది. దీంతో కొండలపైన అలైన్‌మెంట్ పైన అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. బుధవారం హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి , సీనియర్ ఇంజనీర్‌లతో కలిసి రాజేంద్రనగర్ కొండ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ కొండపైన సుమారు 1.3 కి.మీ పొడవుగల విమానాశ్రయ మెట్రో అలైన్‌మెంట్ నిర్మాణం కోసం కసరత్తు చేపట్టారు. ఈ మార్గంలో నిటారుగా ఉండే ఎత్తులు, బండరాళ్లు, లోయలు ఉండడం వల్ల మెట్రో వయాడక్ట్ నిర్మాణం చాలా కష్టమైన పని అని ఈ సందర్భంగా ఎండీ అభిప్రాయపడ్డారు.ఈ మార్గాన్ని పరిశీలించిన అనంతరం కొన్ని నిర్ణయాలు తీసుకున్నారు.

- మెట్రో అలైన్‌మెంట్, ఔటర్‌రింగ్‌రోడ్డు క్రాష్ బారియర్ మధ్య దాదాపు 18 అడుగుల గ్యాప్ మాత్రమే ఉంది.దీంతో ఔటర్ లోతైన కటింగ్‌లో ఉన్నందున వల్ల అటువైపు ఎటువంటి బండరాళ్లు పడకుండా తగిన బలం, ఎత్తుతో కూడిన రక్షణ బ్యారియర్లను అమర్చాలని ప్రతిపాదించారు.



- ఈ మార్గంలో మెట్రో అలైన్‌మెంట్‌కు బౌల్డర్ స్టెబిలైజేషన్ పద్ధతులను నిపుణులతో సంప్రదించి అవలంబించాలి
- కొండపై నుంచి వెళ్లేటప్పుడు మెట్రో వయాడక్ట్‌ను రక్షించేందుకు విమానాశ్రయం మెట్రో కు ఎడమ వైపున రక్షిత ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేయాలి.దీనివల్ల సంఘవిద్రోహ శక్తుల నుంచి రక్షణ లభిస్తుంది.
- విమానాశ్రయ మెట్రో ప్రాంతంలో ఎలాంటి ఆక్రమణలు చోటుచేసుకోకుండా నియంత్రించేందుకు హెచ్‌ఎండీఏ సహకారంతో సరిహద్దు రాళ్లను ఏర్పాటు చేయవలసి ఉంటుంది.
- కొండపైన రాయిని తొలగించవలసిన అవసరం లేకుండా స్టబ్‌లు లేదా తక్కువ ఎత్తు ఉన్న స్తంభాలపై మెట్రో వయాడక్ట్‌ను నిర్మించే అంశాన్ని పరిశీలించాలి.

క్రాస్ డ్రైయిన్‌ల ఏర్పాటు...

- మరోవైపు ఔటర్ డ్రైనేజీ వ్యవస్థలోకి వర్షపు నీరు ప్రవహించేలా కొండపైన హెచ్‌ఏఎంఎల్ నిర్మించిన తాత్కాలిక రహదారి లోయ పాయింట్ల వద్ద తగినంత వ్యాసార్థంతో కూడిన హ్యూమ్ పైపులతో క్రాస్ డ్రెయిన్‌లు ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా నిర్ణయించారు.
- అలాగే కొండపై దాదాపు 300 మీటర్ల వరకు విస్తీర్ణంలో చేపట్టిన తాత్కాలిక రహదారిని త్వరలో పూర్తి చేయాలని ఎన్వీఎస్ రెడ్డి అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎయిర్‌పోర్ట్ మెట్రో చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ ఆనంద్ మోహన్, జనరల్ మేనేజర్ విష్ణువర్ధన్ రెడ్డి, సీనియర్ ఇంజనీర్ సాయపరెడ్డి పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం



శాంతమ్మ (ఫైల్)

మీర్‌పేట: పనికోసం ఇంటి నుంచి వెళ్లిన మహిళ అదృశ్యమైన సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ సత్యారెడ్డి తెలిపిన ప్రకారం. బడంగ్‌పేటకు చెందిన రాసాల శాంతమ్మ (54) కూలీ. రోజు మాదిరిగా ఈ నెల 22న ఆమె కూలీపని కోసం స్థానికంగా ఉన్న లేబర్ అడ్డా వద్దకు వెళ్లింది. తిరిగి ఇంటికి రాలేదు. ఆచూకీ కోసం పరిసర ప్రాంతాల్లో వెతికినా ప్రయోజనం లేకపోవడంతో కుటుంబ సభ్యులు బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

సామాజిక సేవలోనే సంతృప్తి

శంషాబాద్: సామజిక సేవలో భాగస్వాములైన వారికి ఎంతో సంతృప్తి లభిస్తుందని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. పట్టణానికి చెందిన వ్యాపారవేత్త కందకట్ల సిద్దురెడ్డి ఓ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల నిర్మాణం చేపట్టి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. సామాజిక సేవలో తనవంతు బాధ్యతగా మరిన్ని కార్యక్రమాలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు సిద్దురెడ్డి తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బండి గోపాల్‌యాదవ్, నార్సింగి ఏఎంసీ చైర్మన్ వెంకటేష్‌గౌడ్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు ఆర్. గణేష్‌గుప్తా, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు చంద్రారెడ్డి, కౌన్సిలర్లు కుమార్ తదితరులున్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

రాజేంద్రనగర్: అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను ఇవ్వాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జాతీయ కౌన్సిల్ సభ్యులు దేవేందర్ అన్నారు. బుధవారం అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ టీడబ్ల్యూజేఎఫ్ నియోజకవర్గ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.సుదర్శన్‌గౌడ్, నర్సింహులు ఆధ్వర్యంలో రాజేంద్రనగర్, గండిపేట్ మండలాల తహసీల్దార్లకు వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర సాధనలో కీలకపాత్ర పోషించిన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. గత 25 ఏళ్ల నుంచి జర్నలిస్టులు అనేక కష్ట నష్టాలను ఓర్చుకుని వృత్తిని కొనసాగిస్తున్నారన్నారు.

- రాష్ట్ర ఏర్పాటు అనంతరం కూడా జర్నలిస్టులు ఇళ్ల స్థలాలు లేక ఇబ్బందులు పడటం ఆందోళన కలిగిస్తుందన్నారు. సీఎం కేసీఆర్ రాష్ట్రం ఏర్పడిన తరువాత జర్నలిస్టులు అందరికీ ఇళ్ల స్థలాలు ఇస్తామని అనేక వేదికల మీద మీడియా సమావేశాల్లో అనేక సార్లు హామీ ఇచ్చారని తెలిపారు.
- మంత్రులు కూడా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇస్తామని ఇటీవల కాలంలో అనేకసార్లు హామీ ఇచ్చారన్నారు.
- ఇచ్చిన హామీల మేరకు జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చి వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర వ్యాప్తంగా పోరాటాలకు పిలుపునిచ్చిందన్నారు. దీనిలో భాగంగానే రాజేంద్రనగర్, గండిపేట్ తహసీల్దార్లకు వినతిపత్రాలను అందజేశామన్నారు. యూనియన్ ఉపాధ్యక్షులు బుచ్చన్న, ఎం.శ్రీనివాస్, సహాయ కార్యదర్శి మాధవచారి, కార్యవర్గ సభ్యులు మద్దూరి శ్రీనివాస్, కె.సతీష్ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న టీడబ్ల్యూజేఎఫ్ యూనియన్ నేతలు

మణికొండ: తెలంగాణ ఉద్యమంలో అనేక పార్టీల నాయకుల కంటే అధికంగా జాతిని జాగృతం చేయటంతో పాటు యాజమాన్యాలు అడ్డు చెప్పినా తెగించి రాష్ట్ర సాధనకు పోరాటం చేసిన జర్నలిస్టులకు రాష్ట్రం వచ్చి 8 ఏళ్లు దాటినా కనీసం ఇళ్ల స్థలాలు ఇవ్వకపోవటం విడ్డూరమని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ జాతీయ కౌన్సిల్ సభ్యుడు దేవేందర్ వాపోయారు. బుధవారం గండిపేట తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను కేటాయించాలని కోరుతూ.. వినతిపత్రం అందచేశారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి నర్సింహులు, ఉపాధ్యక్షులు బుచ్చన్న, శ్రీనివాస్, సహాయ కార్యదర్శి మాధవచారి, కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్, కె.సతీష్ తదితరులు పాల్గొన్నారు.